క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు రానీయొద్దు



విద్యుత్ సిబ్బందితో సమీక్షిస్తున్న ఏడీ సతీష్ కుమార్‌రెడ్డి

సంజామల: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని కోవెలకుంట్ల విద్యుత్ ఏడీ సతీష్ కుమార్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం సంజామల సబ్‌స్టేషన్‌లో మండలం విద్యుత్ సిబ్బందితో సమీక్షించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈ దుర్గశ్రీనివాస్ ఉన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏవో

బనగానపల్లె: కొద్ది రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి శుక్రవారం పరిశీలించారు. పలుకూరు, బీరవోలు, రామతీర్థం గ్రామాల్లో మొక్కజొన్న, కంది, జొన్న పంటలను పరిశీలించారు. పంట నష్ట వివరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

వరద బాధితులకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కోవెలకుంట్ల: విజయవాడలోని వరద బాధితులకు కోవెలకుంట్లకు చెందిన విక్కీ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం దుస్తులు, చీరలు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన సూర్య డ్రస్సెస్ యజమాని రత్నం 400 జతల దుస్తులు, వంద చీరలను వరద బాధితులకు అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి కోరారు. దాత ఇచ్చిన దుస్తులను విజయవాడలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పట్నాయక్, బద్రి, రాంబాబు సహకారంతో వరద బాధితులకు పంపిణీ చేశారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

బనగానపల్లె: ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ సంఘం నూతన అధ్యక్షుడు జి.పెద్దకృష్ణయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఖాసీంబాషా, ట్రెజరర్‌గా ఎం.సాహెబ్‌హుస్సేన్, కమిటీ సభ్యులను ఎన్నుకుని వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జయరాజ్, కంబగిరి రాముడు, పరందాముడు, రహమతుల్లా, పోలూరు వెంకటకృష్ణ, మద్దయ్య, రమేష్, సురేంద్రనాథ్, వెంకట్రామిరెడ్డి, అబ్దుల్‌హుసేన్, మురళి పాల్గొన్నారు.

నేత్ర దానం



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మృతుని కుమార్తె

బేతంచెర్ల: పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన యాలూరు నాగేశ్వర్‌రెడ్డి (54) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన నేత్రాలు దానం చేస్తామని కుటుంబ సభ్యులు లైఫ్ యువనేత్ర సభ్యులకు తెలిపారు. వారు కర్నూలు ప్రభుత్వ కంటి వైద్యులకు సమాచారం ఇచ్చారు. వైద్యులు మృతుని నేత్రాలను సేకరించారు. నేత్ర దానంతో మరొకరి జీవితంలో వెలుగు నింపిన వారవుతారని.. ఇలాగే అందరూ ముందుకు రావాలని వైద్యులు పేర్కొన్నారు.

ఘనంగా తిరుచ్చి ఉత్సవం

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఆశ్వయుజ మాసం శుక్రవారం రాత్రి స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. స్వామివారిని పల్లకీలో ఆశీనులు చేసి మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిలేటి స్వామి, మనోహర్, నరసింహ పాల్గొన్నారు.

పాలేరు ఉధృతి

- భారీ వర్షాలకు ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద
- సంజామల–తాడిపత్రి మధ్య ఆగిన రాకపోకలు



సంజామలలో బ్రిడ్జిపై నీటి ప్రవాహం



ముదిగేడు-పాలేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు



శివవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గొల్లలేరు

సంజామల: అల్పపీడనం ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సంజామల సమీపంలోని గొల్లలేరు, పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అవుకు మండలం శివవరం సమీపంలో బనగానపల్లె–ఆకుమల్ల బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. అయితే శివవరం వద్ద పాలేరు వాగుపై బ్రిడ్జి పనుల నిమిత్తం తాత్కాలిక కట్టను ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు శుక్రవారం కట్ట తెగిపోయింది. దాంతో ముదిగేడు–పాలేరు వాగుకు నీటి ప్రవాహం అధికంగా కొనసాగుతోంది. ముదిగేడు, సంజామలలోని గొల్లలేరు, పాలేరు బ్రిడ్జిలపై సుమారు రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తున్నాయి. దీని కారణంగా కోవెలకుంట్ల నుంచి సంజామల మీదుగా తాడిపత్రికి వెళ్లే బస్సుల రాకపోకల బంద్ అయ్యాయి.

పొంగిపొర్లుతున్న వాగు

అవుకు: మండల పరిధిలోని శివవరం గ్రామం వద్ద ఉన్న గొల్లలేరు వాగు శుక్రవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆకుమళ్ల నుంచి బనగానపల్లెకు శివవరం మీదుగా బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. అయితే శివవరం గ్రామ సమీపంలో గొల్లలేరు వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాకపోకలకు అంతరాయం కలగకుండా నిర్మాణ పనుల పక్కనే వాగు పారటానికి పైపులైన్లను ఏర్పాటు చేసి మట్టితో పూడ్చారు. కొద్ది రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గొల్లలేరు వాగు, పాలేరువాగుతో పాటు పలుచోట్ల నుంచి నీరు ఎక్కువగా వాగులోకి చేరడంతో బ్రిడ్జి నిర్మాణ పనుల పక్కన ఏర్పాటు చేసిన రహదారిపై నుంచి దాదాపు 3 అడుగుల ఎత్తులో నీరు పారుతోంది. దీంతో రెండు రోజులుగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అటుగా వెళ్లే వాహనదారులకు గ్రామస్తులు ప్రమాద హెచ్చరికలు చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రెండు రోజుల్లో నీటి ఉధృతి తగ్గుతుందని భావిస్తున్నారు.

కొనసాగుతున్న వర్షాలు

- కోవెలకుంట్లలో 19.2 మి.మీ వర్షం

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఐదు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం కోవెలకుంట్ల మండలంలో 19.2 మి.మీ, సంజామలలో 13.2 మి.మీ, ఉయ్యాలవాడలో 12 మి.మీ, కొలిమిగుండ్లలో 11.6 మి.మీ, దొర్నిపాడు మండలంలో 2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్నతోపాటు రబీలో సాగు చేసిన జొన్న, పొగాకు పంటల్లో నీరు చేరి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో వివిధ పంటల సాగుకు అదును కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలతో పొలాలు బీళ్లుగా మారే అస్కారం ఉందని ఆందోళన చెందుతున్నారు.



కోవెలకుంట్ల : కందిపంటలో చేరిన వర్షపునీరు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె: పాతపాడు, పసుపల గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు..తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు ఏఈ తెలిపారు.

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలో నెలసరి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించాలని ఏఈ సూచించారు.

విగ్రహ ధ్వంసం నిందితులను శిక్షించాలి

కోవెలకుంట్ల: తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వంపై ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం దుండగులను శిక్షించాలని కోరారు. అలాగే హైదరాబాద్‌లో 150 మంది ముష్కరులు బస చేసేందుకు అవకాశం కల్పించిన హోటల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు వెంకటకుశాయి, బన్నీయాదవ్ ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ప్యాపిలి: బాలికలు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడాలని సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. బాలికలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ధైర్యంగా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బాలికల సంరక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. సరైన ప్రణాళికతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎస్ఐ మధుసూదన్ మాట్లాడుతూ.. పాఠశాలకు వచ్చివెళ్లే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం బాలికల వసతిగృహాన్ని సందర్శించిన జడ్జి బాలికల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం సరళ, ఆర్డీటీ టెక్నికల్ డైరెక్టర్ మురళి, రీజనల్ డైరెక్టర్ సరస్వతి, ఎస్టీఎల్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల బహిష్కరణ

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, సంపద సృష్టి, తదితర అభివృద్ధి ప్రణాళికలపై వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు శిక్షణ తరగతులకు హాజరు కాలేదు. మండలస్థాయి అధికారులెవరూ లేకుండా నిర్వహించే శిక్షణా తరగతుల్లో తాము అడిగే ప్రశ్నలు, సందేహాలను ఎవరూ నివృత్తి చేస్తారని వార్డు సభ్యులు తరగతులను బహిష్కరించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థితో వ్యాయామ ఉపాధ్యాయులు

డోన్ టౌన్: పాతపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జశ్వంత్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పద్మావతి తెలిపారు. శుక్రవారం కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, ఇందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మీప్రభావతి, హుస్సేన్‌భానులను అభినందించారు.

అరటిలో సస్యరక్షణ చర్యలు



అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

ప్యాపిలి: వర్షాలకు పంట దెబ్బతినకుండా అరటి రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు అన్నారు. మండల పరిధిలోని పీఆర్ పల్లి, నల్లమేకలపల్లి గ్రామాల్లోని అరటి తోటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. సిగటోక తెగులు వ్యాప్తి నివారణకు అరటి తోటలో కలుపు పెరగకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తల్లి మొక్క చుట్టూ వచ్చే పిలకలను, మొక్క చుట్టూ ఎండిపోయిన ఆకులను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ట్రైకోడెర్మావిరిడి లేదా జీవ శిలీంద్రాలను వేపనూనెతో కలిపి పాదులు, చెట్టు ఆకులు మొత్తం తడిసేలా 15 రోజులకోసారి పిచికారీ చేయాలన్నారు. ఆయనతో డోన్ ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి ఉన్నారు.

రక్షణ కల్పించాలని డీఎస్పీకి వినతి



డీఎస్పీ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

డోన్ టౌన్: తమను బెదిరిస్తూ పొలాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న న్యాయవాది నుంచి తమకు రక్షణ కల్పించాలని ఉడుములపాడుకు చెందిన బాధితులు డీఎస్పీ శ్రీనివాసులు వద్ద మొరపెట్టుకున్నారు. శుక్రవారం పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి అనంతరం డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సంగు స్వామిరెడ్డి, లక్ష్మీదేవి, నాగేశ్వరరెడ్డి, మహాలక్ష్మీ, సుబ్బమ్మ, శేఖర్, గోపి మాట్లాడుతూ.. ఉడుములపాడుకు సర్వే నంబర్ 78–2లో తమ పొలం పక్కనే లాయర్ కృష్ణప్రసాద్ ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా కంకర ఫ్యాక్టరీ నడుపుతున్నాడని తెలిపారు. అందులో నుంచి వచ్చే దుమ్ముధూళి పొలంలో పడి పంటలు దెబ్బతింటున్నాయని అధికారులకు ఫిర్యాదు చేయడంతో కక్షసాధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. పొలంపై జేసీబీతో తొక్కించి, పంటపై గడ్డి మందు పిచికారీ చేశారని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయన కుమారుడు హరీష్, సంగు హరితో కలిసి చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పొలం లాక్కోవాలని చూస్తున్నారని తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

చెత్త బుట్టల పంపిణీ చేసేదెప్పుడో..?

కొలిమిగుండ్ల: పారిశుద్ధ్య నిర్మూలన కోసం ఇటీవలే గ్రామ పంచాయతీలకు చెత్త బుట్టలు మంజూరు చేశారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆయా గ్రామాలకు అందజేశారు. కొలిమిగుండ్లలో నెల రోజులైనా చెత్త బుట్టలను ప్రజలకు పంపిణీ చేయలేదు. తడి,పొడి చెత్త కోసం ఒక్కో ఇంటికి రెండు బుట్టలను అందజేసేందుకు మంజూరు చేశారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారులు, నివాస ప్రజలు చెత్తను రోడ్డు డివైడర్ వద్ద ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. వారంలో ఒకటి,రెండు సార్లు శుభ్రం చేస్తున్నా యథావిధిగా చెత్త దర్శనమిస్తోంది. ప్రధాన రహదారితో పాటు పలు కాలనీల ప్రజలు చెత్తను ఎక్కడ వేయాలో తెలియక ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచుకుని బ్రిడ్జిలో పడేస్తున్నారు. పంచాయతీ అధికారులు చెత్త బుట్టలను పంపిణీ చేస్తే చెత్తను అందులో నిల్వ చేసుకోవచ్చని గ్రామస్తులు పేర్కొన్నారు.

22 నుంచి ఆధార్ క్యాంప్‌లు

అవుకు: మండల పరిధిలోని రామాపురం, శింగనపల్లె, గుండ్లశింగవరం గ్రామ సచివాలయాల్లో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఉచిత ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉచిత ఆధార్ క్యాంప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. డిజిటల్ అసిస్టెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండి సక్రమంగా సేవలు అందించాలని తెలిపారు. ప్రతి రోజూ కార్యక్రమం అనంతరం రిపోర్టులను ఎంపీడీఓ కార్యాలయానికి సమర్పించాలన్నారు. అదేవిధంగా ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించే తేదీలు, సెంటర్ల వివరాలను అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా ఆయా గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

విద్యుత్ చార్జీలపై నిరసన

డోన్ టౌన్/బేతంచెర్ల: విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపడాన్ని నిరసిస్తూ డోన్, బనగానపల్లెలో సీపీఎం నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఆయా విద్యుత్‌కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. డోన్‌లో సీపీఎం నాయకులు కొయిలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, బేతంచెర్లలో ఎల్లయ్య, రామాంజనేయులు, మధుశేఖర్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి



సీసీలకు జ్ఞాపికలను అందజేస్తున్న డీఆర్‌డీఏ వెలుగు పీడీ

బనగానపల్లె రూరల్: పొదుపు సంఘాల్లోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వెలుగు సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో క్లస్టర్ పరిధిలోని ఏపీఎంలు, సీసీలు, బుక్‌కీపర్లతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. పొదుపు సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా బలపడేందుకు బ్యాంకర్లతో మాట్లాడి గ్రూపులకు విరివిగా రుణాలను మంజూరు చేయించాలని సూచించారు. అలాగే రుణాల రికవరీలోనూ బ్యాంకర్లకు సహకరించాలని తెలిపారు. స్త్రీనిధి, ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉన్నతి పథకం కింద రుణాలను ఇప్పించాలన్నారు. ఈ రుణాలను సక్రమంగా వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం మండలాల వారీగా పొదుపు సంఘాలకు ఇచ్చిన రుణాలు, రికవరీ తదితర అంశాలను ఏపీఎంలు, సీసీలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి పథకం కింద రుణాలు ఎక్కువగా మంజూరు చేయించిన సీసీలకు మెమోంటో అందజేసి అభినందించారు. కోవెలకుంట్ల క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ గురుస్వామి అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితో దేశ పురోగతి

బేతంచెర్ల: గ్రామాల అభివృద్ధితోనే దేశం పురోగతి వైపు పయనిస్తుందని, గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, పంచాయతీరాజ్ ఇంజినీర్ మహేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంబాపురం గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఆర్ఎస్ రంగాపురంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రూ. 57 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

బనగానపల్లె రూరల్: మండలంలోని వెంకటాపురం, చెరువుపల్లె, బీరవోలు, రామతీర్థం గ్రామాల్లో రూ.60లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి ఎంపీడీఓ వెంకటరమణ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రమణ, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఎం రేష్మా పాల్గొన్నారు.

విశ్వానికి వెలుగును ప్రసాదించిన శాస్త్రవేత్త ఎడిసన్



ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: థామస్ ఆల్వా ఎడిసన్ కనుగొన్న విద్యుత్ బల్బు వల్ల ప్రపంచమంతా వెలుగును చూస్తోందని హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. థామస్ అల్వా ఎడిసన్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు బాగా చదువుకుని కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు వెంకటరమణ, సుబ్బారెడ్డి, లక్ష్మయ్య, లక్ష్మీ, రాధా, బాబు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా చౌడేశ్వరీదేవి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం చౌడేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణ, నివేదన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో అందంగా ముస్తాబు చేసి సంప్రదాయబద్ధంగా పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ పర్యవేక్షించారు.

జీవాలకు నట్టల నివారణ మందు

బేతంచెర్ల: మేకలు, గొర్రెల్లో నట్టల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని బేతంచెర్ల పశువైద్యుడు అజయ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సన్న జీవాలకు నట్టల నివారణ మందులను తాపించారు. ఆయన మాట్లాడుతూ.. జీవాల్లో నట్టలు మూడు రకాలని.. జలగలు, ఏలిక పాములు, బద్దె పురుగులు అన్నారు. వాటి నివారణకు ఏడీడీఎల్, సీఏడీడీఎల్‌లో పేడ పరీక్షలు చేయించుకుని 3 నెలలకు ఒక్కసారి పశు వైద్యుని సలహా మేరకు తగిన మోతాదులో నట్టల మందును తాగించాలని తెలిపారు. ఈ జలగలు నత్తల ద్వారా వ్యాపిస్తాయని, కావున చెరువు గట్ల వద్ద కాపర్ సల్ఫేట్ చల్లడం ద్వారా నత్తలను నివారించవచ్చన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకోవాలి

డోన్ టౌన్: ఇటీవల మోడల్ స్కూల్ వద్ద బస్సు ప్రమదానికి గురై గాయపడిన విద్యార్థినులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు తెలుగు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడి కర్నూలులో చికిత్స పొందుతున్న విద్యార్థులను శుక్రవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ పేజీలో గ్రామ పంచాయతీ పాలనపై అవగాహన



బనగానపల్లె: మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ



బేతంచెర్ల: మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి

బనగానపల్లె రూరల్: గ్రామ పంచాయతీ పాలనపై స్థానిక ప్రజాప్రతినిధులు అవగాహన పెంచుకుంటే అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో మండలంలోని ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకంగా ఉంటుందని తెలిపారు. పంచాయతీలకు వచ్చే ప్రభుత్వ నిధులతో జరిగే అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలన్నారు. మండల ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ రమణ, పలుకూరు ఈఓ బాలాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

బేతంచెర్ల: ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకున్నందుకు మన వంతుగా ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం, గ్రామాల అభివృద్ధి, పంచాయతీ విధులు, గ్రామ సభ, తీర్మానాలు, ప్రజల భాగస్వామ్యం, ఆమోదాలు తదితర అంశాలపై ట్రైనర్ కృష్ణమూర్తి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఈఓఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

సంజామల: ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు కలసికట్టుగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ సాల్మాన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారికి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఏఓ విజయకుమర్ రెడ్డి, ఈఓఆర్డీ రాధికారెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఏఈ హరి పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణా తరగతులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి ప్రారంభించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పలు పథకాలపై అవగాహన కల్పించారు. బిల్డింగ్ అప్రూవల్, ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్, గ్రామ పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్ల ఏర్పాటు తదితర అంశాలపై వివరించారు. గ్రామాల అభివృద్ధిలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల పాత్ర చాలా అవసరమన్నారు.